



- ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులకు తీపి కబురు
- 29న నగదు డ్రా చేసుకోవాలని ఎంపీడీవోలకు ఆదేశాలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7.59 లక్షల మందికి లబ్ధి
- రెండు నెలలుగా పెన్షన్ తీసుకోని వారికి నగదు చెల్లింపునకు ఏర్పాట్లు


పింఛన్లు.. ఒక రోజు ముందే



గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం.. సెలవు. అంటే వచ్చే నెలలో పింఛన్ ఒకరోజు ఆలస్యంగా అందుతుంది. ఎలా అని ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులు ఆలోచనలో ఉన్నారు. అయితే వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిసెంబరు నెల పెన్షన్ ఒక రోజు ముందే అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీ శనివారమే పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, ఆయా వ్యాధుల చేత బాధింపబడేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబరు 29వ తేదీనే పెన్షన్ సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేయాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఎంపీడీవోలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. శనివారం సచివాలయ ఉద్యోగులందరూ పెన్షన్ పంపిణీ కోసం అందుబాటులో ఉండాలని జిల్లా అధికారులు వారికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం పెన్షన్ పొందని వారికి డిసెంబరు 2న అందజేయనున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గుంటూరు జిల్లాలో 2,55,258 మందికి, పల్నాడు జిల్లాలో 2,75,070 మందికి, బాపట్ల జిల్లాలో 2,29,635 మందికి ఒక రోజు ముందే పెన్షన్ చేతికి రానుంది. గత ప్రభుత్వ హయాంలో నెల మొదటి తేది సెలవు దినమైతే ఆ మరుసటి రోజు పెన్షన్ పంపిణీ చేసే వారు. అందువల్ల పెన్షన్‌దారులు కొంత ఇబ్బంది పడే వారు. సెలవులు వరుసగా రెండు, మూడు రోజులు వచ్చినప్పుడు కూడా అప్పటి ప్రభుత్వం పెన్షన్‌దారులను (మిగతా 6వ పేజీలో..)

రైతులకు.. రాయితీలు

- అన్నదాతలకు ప్రభుత్వం అండ
- యంత్ర పరికరాలు మొదలు రుణాల వరకు లబ్ధి
- వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కిన పథకాలు పునరుద్ధరణ
- ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లోనూ పెద్ద ఎత్తున కేటాయింపులు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.700 కోట్ల వరకు లబ్ధి







(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఐదేళ్లూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా వ్యవసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన ఘనత వైసీపీది. 2014–19 మధ్య కొనసాగిన అనేక పథకాలకు గత పాలకులు మంగళం పాడారు. ఇక కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నిబంధనాల చట్రంలో వారిని బిగించేశారు. విత్తన రాయితీలు, వ్యవసాయ అనుబంధ పాడిపరిశ్రమకు ఊతమిచ్చే అనేక కార్యక్రమాలను అటకెక్కించిన గత పాలకులు అన్నదాతల వెన్ను విరిచారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉండేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో గతంలో రైతులకు అందించిన అన్ని రాయితీలను తిరిగి పునరుద్ధరించింది. ఇందుకు సంబంధించి రైతు సేవా కేంద్రాలు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాయి. మొన్నటి బడ్జెట్‌లో కూడా వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. గతంలో టీడీపీ ప్రభుత్వం రైతులకు కావాల్సిన యంత్రపరికరాలను వ్యక్తిగతంగా రాయితీపై అందించేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పి గ్రూపుల పేరిట వైసీపీ శ్రేణులకు లబ్ధి చేకూర్చింది. ప్రస్తుతం యంత్ర పరికరాలను తిరిగి రైతులకు వ్యక్తిగతంగా అందించడానికే కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. తైవాన్ స్ప్రేయర్ల విషయంలో రైతులకు 8 నుంచి 10 వేల వరకు రాయితీని అందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు కావాల్సిన ట్రాక్టర్, నూర్పిడి యంత్రాలతో పాటు అత్యాధునికంగా మార్కెట్‌లోకి వచ్చిన వ్యవసాయ అనుబంధ యంత్రాలను రాయితీపై అందించే విధంగా ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి (మిగతా 6వ పేజీలో..)



6 కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా
- బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్

1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

కోడిగుడ్డు ధర.. పైపైకి



- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు

8 వెయిట్ లిఫ్టింగ్ విజేత **శివాజీ యూనివర్సిటీ**

ఏఎన్‌యూలో ముగిసిన సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారమివ్వాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నరసరావుపేట ఆర్డీవో కార్యాలయ సమావేశం మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెవెన్యూ సంబంధిత విషయాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతివారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా వస్తున్న అర్జీలలో 70 శాతం భూ, రెవెన్యూ సంబంధించినవే ఉంటున్నాయని వాటిని మండల స్థాయిలోనే పరిష్కరించేలా చూడాలన్నారు. పరిష్కారం కానీ ఫిర్యాదులు గురించి సంబంధిత ఫిర్యాదుదారుడితో చర్చించి వివరాలు తెలియచేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఫిర్యాదులు పరిష్కారంపై వీఆర్వోలు, కింది స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆర్డీవోకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఇతర అవసరాల నిమిత్తం నరసరావుపేట మున్సిపాలిటీలో ఐదు కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ సూరజ్‌గనోరే, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ డే వేడుకలు

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 132వ ప్రపంచ విక్టోరియల్ ఫొటోగ్రఫీ వేడుకలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఈ వేడుకల్లో 25 మందికి మెమోరియల్ అవార్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ వేడుకలను జర్నలిజం విభాగంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగిన వారికి ఫొటో కాంటెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో నిష్ణాతులై ఉండి మరణించిన వారి పేరు మీద 25 మెమోరియల్ అవార్డులకు ఫొటోలు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డులు పొందిన ఛాయా చిత్రాల ప్రదర్శనను ఈ వేడుకల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. విజేతలకు బంగారు పథకంతో పాటు నగదు బహుమతులను కూడా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అందజేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గురువారం అవార్డులు పొందిన వారి వివరాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సురేష్ కుమార్, జర్నలిజం విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ జె .మధుబాబు, ఫొటోగ్రఫీ కోర్స్ అతిథి అధ్యాపకులు టిశ్రీనివాస్ రెడ్డి, ఫొటోగ్రాఫర్ జి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

● వరగాని చెక్‌పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ


వరగాని చెక్‌పోస్ట్ వద్ద రోడ్డుపై పడి ఉన్న మృతదేహాలు

పెదనందిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని చెక్‌పోస్ట్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరగాని గ్రామానికి చెందిన తూమాటి శ్యాంసన్ (55), దేవరపల్లి జాన్ (14) ఇద్దరూ టీవీఎస్ మోపెడ్ ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులో నుంచి గుంటూరు-పర్చూరు రహదారిలోకి వస్తున్న క్రమంలో గుంటూరు వైపు నుంచి పత్తి విత్తనాల లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్‌ఐ ఏకనాథ్ తెలిపారు. పరారైన లారీ డ్రైవర్‌ను పట్టుకుని లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

8 ఇసుక ట్రాక్టర్లు సీజ్



కొల్లిపర, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో ఎస్‌ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ జరిమానా విధించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల వితరణతో రెండో బస్సు

● రూ.35 లక్షల విరాళం ప్రకటించిన వైద్యులు



సుందరాచారికి లేఖను అందజేస్తున్న సునీల్ నాయక్, శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలకు దాతల సహకారంతో రెండు కొత్త బస్సులు సమకూరనున్నాయి. ఈ రెండు నూతన బస్సులను 1999వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందజేయనున్నారు. గత వారం ఈ బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు రూ.40 లక్షల వ్యయంతో 60 సీట్ల కెపాసిటితో కొత్త బస్సును కాలేజీకి విరాళంగా ప్రకటించారు. వైద్య విద్యార్థుల అవసరాలకు మరో బస్సు కూడా అవసరమని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి కోరడంతో ఇదే బ్యాచ్‌కు చెందిన ఏడు మంది పూర్వ విద్యార్థులు రూ.35 లక్షలతో రెండో బస్సును విరాళంగా అందజేసేందుకు గురువారం ముందుకు వచ్చారు. విరాళం ప్రకటించిన వారిలో అమెరికాకు చెందిన ఎన్నారై వైద్యులు రుమటాలజిస్ట్ సాహిత్య మల్లిపెద్ది, ఇంటర్నరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర్ కాటూరు, ఇంకా ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ యెల్లినేడి (హైదరాబాద్), ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్ట్ శ్రీకాంత్‌రెడ్డి బసిరెడ్డి (తిరుపతి), ఆప్తమాజిస్ట్ సదాశివరావు తిమ్మసార్తి (హైదరాబాద్), ఆర్థోపెడిక్ సర్జన్ నరేష్‌రెడ్డి యర్రం (తెనాలి), ఆప్తమాలజిస్ట్ సునీల్ కుమార్ నాయక్ బుక్కె (విజయవాడ) ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దాత డాక్టర్ సునీల్ కుమార్ రెండో బస్సు విరాళానికి సంబంధించిన పత్రాలను గురువారం డాక్టర్ సుందరాచారికి అందజేశారు. కాలేజీ గ్రంథాలయ ఆధునీకీకరణకు, కొత్త జర్నల్స్ అందజేసేందుకు 99వ బ్యాచ్ విద్యార్థులు సంసిద్ధత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 1999వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావుతో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

అభిమానుల అభిరుచికి తగిన సినిమాలతో ముందుకు వస్తా

● బుర్రిపాలెంలో సినీ హీరో గల్లా అశోక్


మీడియాతో మాట్లాడుతున్న హీరో గల్లా అశోక్

తెనాలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభిమానుల అభిరుచికి తగ్గట్టుగా రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని సినీ హీరో గల్లా అశోక్ చెప్పారు. హీరో సినిమాతో సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో గల్లా అశోక్. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, ప్రిన్స్ మహేష్‌బాబు మేనల్లుడుగా గల్లా అశోక్ తెలుగు ప్రజలకు సుపరిచితుడే. తన తాత సూపర్‌స్టార్ కృష్ణ, మేనమామ ప్రిన్స్ మహేష్‌బాబు దత్తత గ్రామమైన బుర్రిపాలెంకు గురువారం వచ్చి సందడి చేశారు.

గ్రామంలో తన తాత సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇటీవల విడుదలైన దేవకీనందన వాసుదేవ చిత్రం సూపర్‌హిట్ కావడంతో అభిమానులతో కలసి ఆనందాన్ని పంచుకున్నారు. తొలుత గ్రామంలోకి విచ్చేస్తున్న అశోక్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని పలు ఆలయాల్లో హీరో అశోక్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కృష్ణ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ మామ ప్రిన్స్ మహేష్ బాబుతో కలిసి చిన్నతనంలో నాని చిత్రంలో నటించానని ఇప్పుడు హీరో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చానని చెప్పారు. మహేష్‌మామ అభిమానులు తొలి సినిమా నుంచి నన్ను అభిమానిస్తూ ఇండస్ట్రీలో స్టార్‌గా నిలబెట్టారని చెప్పారు. దేవకీ నందన వాసుదేవ చిత్రాన్ని సూపర్‌హిట్ చేసిన ప్రేక్షకులకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌ను చూసేందుకు మహేష్ బాబు, కృష్ణ అభిమానులు గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

'డ్వాక్రా'సభ్యులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి

● లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మేనేజర్ మహిపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు సామాజిక అంశాల్లో విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రత్న మహిపాల్ రెడ్డి అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓల్డ్ గుంటూరు విభాగం ఆధ్వర్యంలో గురువారం పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై డ్వాక్రా సంఘాలకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ సామాజిక భద్రత, డిజిటల్ అక్షరాస్యత, ఫోన్ పే, గూగుల్ పే గురించి మహిళలకు అవగాహన కల్పించారు. సామాజిక ఆర్థిక, కేంద్ర పథకాలలో వీధి వ్యాపారులు వారి కుటుంబం సభ్యులను నమోదు చేయాలని సూచించారు. వీధి వ్యాపారుల ద్వారా డిజిటల్ లావాదేవీలు చేయించాలని, మొబైల్ యాప్ డౌన్లోడ్ చేయడం, పెండింగ్ రుణాల పంపిణీ చేయడం వంటి విషయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ విజయలక్ష్మిమెప్మా సీఓ సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా నిందితుడికి రిమాండ్

రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అనుచిత పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి మళ్లీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించిన సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు మేరకు.. ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి చెందిన షేక్ మహబూల్ సుభాని అలియాస్ జాన్, మస్తాన్ వలి సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టారు. దీనిపై రెంటచింతల టీడీపీ నేత సన్నెగంటి సిద్దయ్య ఈ నెల 13న స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మహబూబ్ సుభానిని మాచర్ల కోర్టులో హాజరు పర్చగా జామీన్ ఎవరూ లేకపోవడంతో మెజిస్ట్రేట్ శ్రీని వాస్ కల్యాణ్ నెల్లూరు జైలుకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ జి.వెంకటాద్రి గురువారం తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, ఫుల్‌హ్యాండ్స్ గోధుమ రంగు చొక్కా ధరించి 35-40 సంవత్సరాల వ్యక్తి కౌంటర్ ముందు భాగంలో పడి చనిపోయి ఉండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. సహజ మరణమై ఉండవచ్చునని ఎస్‌ఐ తెలిపారు. వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకి తరలించినట్లు తెలిపారు.

ట్యాంకర్ ఢీకొని ఒకరి మృతి


సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహం

బాపట్ల, నవంబరు 28(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మూర్తి రక్షణనగర్ దగ్గర టీవీఎస్ మోపెడ్‌పై వస్తున్న వారిని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పట్టణ ఎస్‌ఐ చంద్రవతి తెలిపిన వివరాల ప్రకారం నరసాయపాలెం గ్రామానికి చెందిన దారా సుజనరావు (53) పట్టణంలోని 9వ వార్డు మూర్తి రక్షణనగర్‌లో తన అత్త వారింటికి టీవీఎస్ మోపెడ్‌పై వచ్చి తిరిగి వెళుతుండగా చీరాల వైపు వెళుతున్న ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న సుజనరావు అక్కడికక్కడే మృతి చెందగా, వెనకాల కూర్చున్న దండమూడి ఏసుపాదంకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వైద్యం కోసం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి దివ్యాంగురాలైన కుమార్తె ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పింఛన్లు.. ఒక రోజు ముందే

(5వ పేజీ తరువాయి)

ఇదే రీతిలో ఇబ్బందులకు గురిచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్‌దారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఈ నెలలో బకాయిలు కూడా తీసుకోవచ్చు

గతంలో లబ్ధిదారులు ఏ కారణం చేతనైనా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెల ఆ మొత్తం కలిపి ఇచ్చే వారుకాదు. దీంతో లబ్ధిదారులు ఆ మొత్తం నష్టపోయినట్లే. రెండు నెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే పూర్తిగా పెన్షన్ తొలగించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఏ కారణం చేతనైనా వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే, మూడో నెలలో రెండు నెలల పాత బకాయి కూడా కలిపి తీసుకునేలా నిబంధనలు మార్పు చేసింది. వరుసగా మూడు నెలల పాటు పెన్షన్ తీసుకోని వారిని పాక్షిక వలసదారులుగా భావిస్తున్నారు. ఆ తర్వాత వచ్చి దరఖాస్తు అందజేస్తే తాత్కాలికంగా నిలిపివేసిన వారి పెన్షన్‌ను పునరుద్ధరిస్తారు. గతంలో ఈ వెసులుబాటు లేదు.

భర్త పెన్షన్ భార్యకు

ఏ కారణం చేతనైనా పెన్షన్‌దారుడైన భర్త చనిపోతే ఆ పెన్షన్‌ను భార్యకు వెంటనే బదలాయించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భర్త చనిపోయిన పదిహేను రోజుల్లోనే భార్యకు మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రైతులకు.. రాయితీలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రూ.220 కోట్ల వరకు వ్యయం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు

కౌలు రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

గత ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన కౌలు రైతులను ఆదుకోవడానికి కూటమి పాలకులు ప్రత్యేక దృష్టిసారించారు. కేవలం సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరిపెట్టకుండా రుణాలను కూడా వారి దరికి చేర్చేలా ఆదేశాలు జారీ చేశారు. కౌలు రైతులను ఆదుకోవడంలో తమతో పాటు బ్యాంకర్లు కూడా కలిసిరావాలని పాలకులు కోరారు. గడచిన ఐదేళ్లలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లకు మించి కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అలాంటిది ఈ ఆర్థికసంవత్సరంలో దాదాపు రూ.220 కోట్ల వరకు రుణాల ద్వారా కౌలు రైతులు లబ్ధి పొందనున్నారు

ఉద్యాన సాగు రాయితీలు

ఉద్యాన పంటలకు అందించే రాయితీల విషయంలో కూడా ఓ లక్ష్యంలో అధికారులు ముందుకెళుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు మూడు జిల్లాల పరిధిలో కలిపి దాదాపు రూ.90 కోట్ల వరకు ఉద్యాన సాగుకు ప్రోత్సాహకాలు అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద పండ్ల తోటల పెంపకం, కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటు, ఎఫ్‌పీవోలో ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చి మెరుగైన మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించడం ఇందులో ముఖ్యమైనవి. మల్చింగ్ షీట్లు, పందిళ్ల నిర్వహణకు తోడు విస్తరణ వంటి అనేక పథకాలకు కేంద్రం అందించే మొత్తాలకు మ్యాచింగ్ గ్రాంటు జత చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించనుంది

రాయితీపై విత్తనాలు

50 శాతం రాయితీపై విత్తనాలు అందించే పథకానికి కూడా గత ప్రభుత్వం తూట్లు పొడిచింది. రాయితీని పదిశాతానికి పరిమితం చేసి రెండేళ్ల పాటు అందించిన వైసీపీ ప్రభుత్వం ఆ తర్వాత దానికి కూడా పూర్తిగా మానేసింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే విత్తనాలు పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సాగుదారులపై ఎకరానికి దాదాపు 5 నుంచి ఆరు వేల వరకు ఈ రాయితీ విత్తనాల వల్ల భారం తగ్గనుంది. దీని వల్ల ప్రభుత్వంపై మూడు జిల్లాల పరిధిలో అదనంగా పడే భారం దాదాపు రూ.120 కోట్ల వరకు ఉండొచ్చనేది అంచనా.

భూసార పరీక్షలు.. అగ్రి ల్యాబ్‌లు..

ఏ పంటకు నేల అనువుగా ఉంటుందో శాస్త్రీయ పరీక్షల్లో అధ్యయనం చేసి వాటి ఫలితాలను రైతులకు అందించడం ద్వారా వారికి ప్రభుత్వం మేలు చేసినట్లవుతోంది. కానీ గడచిన ఐదేళ్లలో ఒక్క శాంపిల్‌ను కూడా పరీక్ష జరిపి రైతులకు ఫలితాలను అందించిన దాఖలాలే లేవు. ఇక అగ్రిల్యాబ్‌లు సంగతి చెప్పక్కర్లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే భూసార పరీక్షలపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా నిర్వహణ ఖర్చులకు నిధులను సైతం జారీ చేసింది. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన వ్యవసాయ బడ్జెట్‌లో కూడా అన్నదాతల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయింపుల జరిపిన సంగతి తెలిసిందే. వీటిలో ముఖ్యంగా కరకట్టల పటిష్టతతో పాటు కాల్వల్లో పూడికతీతలు ప్రధానంగా ఉన్నాయి. వీటికి తోడు రైతు సంక్షేమం కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పథకాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్ల వరకు వ్యయం చేసే విధంగా కేటాయింపులు దక్కనుండడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఏపీఆర్‌జేసీ పూర్వ విద్యార్థి


డాక్టర్ ఏఈఎస్ రమేష్‌చంద్ర

మాచర్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ ఏపీఆర్‌జేసీ 1980-82 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఏఈఎస్ రమేష్ చంద్ర ఇండియన్ ఫారిన్ సర్వీస్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులయ్యారు. కేంద్ర కార్యదర్శి హోదాలో విదేశీ వ్యవహారాల బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే ఆయన భారత రాయబారిగా పది దేశాల్లో సేవలందించారు. ఏపీ, తెలంగాణకు నోడల్ అధికారిగా విదేశీ వ్యవహారాలను కూడా చూశారు. ఈయన ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసి పలు డిగ్రీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించి కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులవడంపై ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సరోజినితో పాటు అధ్యాపకులు హేమంబరరెడ్డి, లింగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు రమేష్‌నాయుడు, వెంకటేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక


షేక్ రోషన్

సత్తెనపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ రోషన్ అనే యువతి తొలి ప్రయత్నంలోనే సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా ఎంపికైంది. విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో ఐదేళ్ల లా విద్యాను 2023లో పూర్తి చేసింది. ఏపీ బార్ కౌన్సిల్లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారు. 2024లో జరిగిన సివిల్ జడ్జి నియామక పరీక్షలో ప్రథమ ర్యాంక్ సాధించి సివిల్ జడ్జిగా ఎంపికైయ్యారు. ఆమె తల్లి సుజాత స్థానిక కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తండ్రి షేక్ కరిముల్లా సిటీ కేబుల్ కరిముల్లాగా పట్టణ ప్రజలకు సుపరిచితుడు.

పాలిమర్‌ల సాయంతో కాలుష్యాన్ని తగ్గించొచ్చు

● విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని


మాట్లాడుతున్న సీవీ అవధాని

గుంటూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవశక్తితో సులభంగా కరిగే పాలిమర్‌లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని పూణెలోని సోమయ్య విద్యావిహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీవీ అవధాని పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సెర్ప్ ఇండియా ఏఎన్‌ఆర్‌ఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో "ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను గురువారం వైభవంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ బ్రోచర్‌ను ముఖ్యఅతిథులు ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూణెలోని సోమయ్య విద్యా విహార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అవధాని మాట్లాడుతూ పాలిమర్ సైన్స్, టెక్నాలజీ రంగం ఎన్నో విధాలుగా ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. మరో ముఖ్యఅతిథి కేరళలోని సెయింట్ బెర్చ్‌మన్స్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెంజిత్ థామస్ మాట్లాడుతూ పాలిమర్‌లు ప్లాస్టిక్, రబ్బర్, ఫైబర్స్, ప్యాకేజింగ్, మెడికల్ పరికరాలు వంటి అనేక విభాగాల్లో వినియోగిస్తారని విద్యార్థులకు తెలియజేశారు. మరో ముఖ్యఅతిథి భువనేశ్వర్‌లోని ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయకృష్ణ మాట్లాడుతూ నానోపాలిమర్‌లు చిన్న పరమాణు స్థాయిలో రూపొందించి అధిక నాణ్యత కలిగిన వస్తువులను సృష్టించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఐఐసీటీ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆర్ట్స్, కామర్స్, లా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పీజీ కోర్సులలో ఖాళీ సీట్ల వివరాలను వెల్లడించారు. ఎంఏ ఇంగ్లిష్ 8, లింగ్విస్టిక్స్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 10, తెలుగు 15, సంస్కృతం 10, హిందీ 10, ఉర్దూ 10, బుద్ధిస్ట్ స్టడీస్ 10, జర్నలిజం 15, సోషియాలజీ 20, సోషల్ వర్క్ 20, రూరల్ డెవలప్‌మెంట్ 15, హిస్టరీ 10, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ 7, పొలిటికల్ సైన్స్ 7, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 10, ఎకనామిక్స్ 15, ఎం కామ్ 17, ఎంఈడీ 20, ఎమ్ఎల్ఐఎస్‌సి 10 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సీట్లు పొందేందుకు ఏపీపీజీ సెట్ రాయని వారు కూడా అర్హులేనని తెలిపారు.

1, 2, 6, 7 తేదీల్లో శబరి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు, 28 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే ప్రమాణికుల రద్దీ దృష్ట్యా డిసెంబరు 1, 2, 6, 7, 9 తేదీల్లో ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1వ తేదీన నంబరు 07131 కాచి గూడ - కొట్టాయం, 2వ తేదీన నంబరు. 07132 కొట్టాయం - కాచీగూడ, 6వ తేదీన నంబరు 07137 హైదరాబాద్ - కొల్లం, 7వ తేదీన నంబరు 07138 కొట్టాయం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు గుంటూరు మీదగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని యాత్రికులు గమనించి ఆయా రైళ్ల సర్వీసులను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసులో నిందితుడు?


నాగరాజు (ఫైల్ ఫోటో)

చేబ్రోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలిక హత్య కేసులో నిందితుడిగా ఉండి, నాలుగు నెలలుగా పరారీలో ఉన్న నిందితుడు నాగరాజు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 9వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల బాలిక శైలజ జులై 15న హత్యకు గురైంది. పాఠశాలకు వెళ్లిన శైలజ సమీపంలోని నాగరాజు అనే గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్ ఇంటిలో శవమై కనిపించింది.పాఠశాలకు వెళ్లిన బాలిక హత్య కావడం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అనుమానితుడు నాగరాజు సంఘటన జరిగిన తర్వాత అదృశ్యం కావటంతోపాటు, సెల్ ఫోన్ వినియోగించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అతని కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి నాలుగు నెలలుగా శోధిస్తున్నారు. అయితే పోలీసులపై విమర్శలు రావటంతో సవాలుగా తీసుకుని నిందితుడిని పట్టుకోవడం కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు. నిందితుడు రాజమండ్రిలో ఉన్నట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

43,251 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 43,722 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,251 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 39,427 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000
నెంబరు. 5	8000	14000
273	10000	10500
341	8000	15500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16000
బ్యాడిగి	8000	13500
దేవనూరు డీలక్స్	8000	14500
తెల్లకాయలు	4500	11000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15000
నెంబరు.5	8500	13500
273	8000	13500
341	8000	15000
4884	8000	13500
సూపర్ 10	10000	11800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16000
బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	10000	14500
తెల్లకాయలు	4500	10000

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

అచ్చంపేట నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తున్నట్లు విద్యుత్ ఏఈ జి శివకోటిరెడ్డి తెలిపారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో మీటరు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులందరి గృహాల్లోనూ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేస్తామని, బిల్లు రీచార్జి రూపంలో చెల్లించాలని తెలిపారు.



● మాచర్ల పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిలర్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు.

● కారంపూడి మండల పరిధిలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో గంటా శ్రీనివాస రెడ్డి తెలిపారు. డిసెంబరు 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లను అందించనున్నట్లు తెలిపారు.

● కారంపూడి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబరు 3న స్థానిక వీరుల గుడి ప్రాంగణంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8886993614, 9493139519 నంబర్లను సంప్రదించాలన్నారు.

సత్రశాలలో సోలార్ పవర్ ప్లాంట్

● ఆర్డీవో మురళీ కృష్ణ వెల్లడి
● స్థానిక అధికారులతో కలసి భూముల పరిశీలన

రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు సమీపంలోని సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన భూములను గురజాల ఆర్డీవో వీ.మురళీ కృష్ణ గురువారం పరిశీలించారు. పదేళ్ల నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. అందులో భాగంగానే ఇటీవలనే విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవి,ఏపిజెన్‌కో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై పూర్తి స్థాయిలో చర్చించడంతో మార్గం సుగమమైంది. 883 సర్వే నెంబర్‌లో ఉన్న 100 ఎకరాల భూమికి సంబంధించి గతంలో అందచేసిన సర్వే రిపోర్ట్‌ను అధికారులు అధ్యయనం చేశారు. 5 ఎకరాల్లో 1 మెగావాట్ సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిని చేయనున్నారు. ఆ లెక్కన ఇక్కడ 20 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. త్వరలో కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జితహసీల్దార్ నగేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పల్లా రామకృష్ణ, విద్యుత్ ప్రాజెక్టు ఈఈ సుబ్రహమణ్యం, నాగరాజు, ఏడీఈలు రత్తయ్య, జయశంకర్, వీఆర్వో పాపారావు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.


సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిని పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో

ప్రభుత్వం సుముఖంగా ఉంది..
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సోలార్ పవర్ ప్లాంట్ భూములను అధికారుల బృందం పరిశీలిస్తున్న సమయంలో ఎమ్మెల్యేబ్రహ్మానందరెడ్డి ఆర్డీవో మురళీకృష్ణతో ఫోన్‌లో మాట్లాడారు. సర్వే రిపోర్టులను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. ఒక మెగావాట్‌కు విద్యుదుత్పత్తికి రూ.5 కోట్లు ఖర్చవుతుందన్నారు. రూ.100 కోట్లతో ఈప్రాజెక్టు ఏడాదిలో పూర్తయ్యేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. 2007 జనవరి 9 నుంచి ఇక్కడ ఏర్పాటు చేయనున్న రెండు యూనిట్ల ద్వారా 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికానుందన్నారు. ఏపీజెన్‌కో పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

8న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

రెంటచింతల,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని 16 సాగు నీటి సంఘాలకు డిసెంబర్ 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు మల్లవరంమేజర్ ఏఈఈ కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. అదే రోజున నామినేషన్ల దాఖలు, పరిశీలన, విత్ డ్రాలు ఉంటాయని, అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో సాగు నీటి సంఘం పరిధిలో కనిష్ఠంగా 1900మంది ఓటర్లుండగా, 16 సాగు నీటి సంఘాల పరిధిలో 31 వేల ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 2015 తరువాత సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు అనర్థం

వెల్దుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనర్థదాయమని, వాటి గురించి ప్రజలకు వివరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ దుర్గ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని శిరిగిరిపాడులో బాల్య వివాహాలపై అవగాహనకల్పిస్తూ ర్యాలీ, అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గురజాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురజాల పట్టణంలో ఎస్ఐ వినోద్‌కుమార్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కూలీలతో అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను నిలిపి డ్రైవర్లు, కూలీలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక లోడుతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామ ని హెచ్చరించారు.

కందిసాగుపై 'పొలంబడి'

బెల్లంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) బెల్లంకొండలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు ఏడీఏ హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై కంది పొలాన్ని పరిశీలించారు. కంది మొగ్గ పూత పిందె దశలో ఉందని ఆకు చుట్టూ పురుగు ఆశించి పంటలకు నష్టం కలుగజేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటిస్తే తక్కువ దిగుబడితో అధికలాభాలు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో బెల్లంకొండ ఏవో కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు చోరీ

బెల్లంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం వ్యవసాయ విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు గురువారం తెల్లవారు జామున పొలాల్లోవున్న విద్యుత్ తీగలను చోరీ చేశారని వాపోయారు. పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీని ఏర్పాటు చేసి విద్యుత్ తీగల చోరీ దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

నాగిరెడ్డిపాలెంలో వైద్యశిబిరం

బెల్లంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయూష్ వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. దేస్కా పకృతి పరీక్షను అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 27 వరకు ప్రజలకి ఈ యాప్‌పై అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రంలో టీడీపీ నేతలు వెన్నా సీతారామిరెడ్డి, అంగనవాడీ సూపర్‌వైజర్ ప్రమీళ, ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం పొందిన బత్తుల

సత్తెనపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళిపాళ్లకు చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్రనేత బత్తుల వెంకటస్వామి గురువారం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో రూ. లక్ష రూపాయలు చెల్లించి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా వెంటస్వామిని కన్నా అభినందించారు.

ప్రోత్సాహక నగదు అందజేత..

రాజుపాలెం మండలం రెడ్డిగూడెంకు చెందిన యజ్ఞశ్రీ డిసెంబరులో కలకత్తా, గుజరాత్‌లో జరగనున్న జూనియర్ నేషనల్ జిమ్నాస్టిక్స్ పోటీలలో పాల్గొననుంది. ఆమెకు ఎమ్మెల్యే కన్నా రూ.13 వేలు ప్రోత్సాహక నగదును అందించారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపి రాణించాలని కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు.

మంచి శాసన సభ్యుడు రామ్మూర్తినాయుడు

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడి చిత్రపటానికి ఘన నివాళి

పిడుగురాళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి శాసన సభ్యుడుగా 1994 నుంచి నారా రామ్మూర్తినాయుడు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశాడని, ప్రజల్లో మంచి శాసన సభ్యుడిగా కీర్తిగడించారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి యరపతినేని శ్రీనివాసరావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాననసభ్యుడిగా రామ్మూర్తినాయుడుతో కలిసి ఎంతో కాలం పనిచేశానని, ఇప్పటి శాసన సభ్యులకు రామ్మూర్తి నాయుడును ఆదర్శప్రాయులని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ప్రకాశం జిల్లా ఎమ్మెల్యే దామరచర్ల జనార్ధన్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడారు.


నారా లోకేశ్, పల్లా శ్రీనివాస్, దామరచర్ల జనార్దన్ తదితరులతో ఎమ్మెల్యే యరపతినేని

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో నియోజవర్గంలోని పలువురు సీఎం సహాయనిధి లబ్ధిదారులకు గురువారం ఆయన చెక్కులను ఆయన పంపిణీచేశారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడుకు చెందిన డీ.వెంకట కోటేశ్వరరావుకు రూ. 59,692, చిందగుంట్ల శ్రీను(అనుపాలెం) రూ.85,440, దెంపగినారాయణ (నెమలిపురి) రూ49,258, ఎం.వంశీ కృష్ణ (ఫణిదం) రూ. 10,5,343, బీ.రామ తులశమ్మ (ముప్పాళ్ల) రూ.10,0806, కే.వినీత్ కుమార్(ముప్పాళ్ల) రూ.2,52,304 చెక్కులను ఎమ్మెల్యే కన్నా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌటశ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, అమరేశ్వర రావు, పెద్దిరాజు, సాంబయ్య, బాస్కర్‌రెడ్డి, శ్రీనివాస రావు, రామచంద్రరావు, వెంకటకోటయ్య పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందినవారితో ఎమ్మెల్యే కన్నా

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

● డీసీహెచ్ఎస్ రంగారావు
● ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ


వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రంగారావు

గురజాలటౌన్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ బీవీ రంగారావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం ఆయన వైద్యులతో సమావేశం నిర్వహిం చారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. మందులు, వివిధ వైద్యపరీక్షలను బయటకు రాస్తున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన డీసీహెచ్ఎస్ ఈ విషయమై సూపరింటెండెంట్ సుధీర్‌ను నిలదీశారు. ఆసుపత్రిలో మందుల కొరతలేనప్పుడు బయటకు ఎందుకు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రికి ఏడాదికి రూ.32 లక్షల విలువైన మందుల సరఫరా జరుగుతుందని, టెస్టులు, మందులు బయటకురాస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మందుల స్టాక్ రూం, ల్యాబ్, ఎక్స్‌రే గదులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల్లో అవకతవకలు ఉండడంతో రెండో సారి ఇలాంటి తప్పులు జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యుడిపై ఆగ్రహం... ప్రభుత్వాసుపత్రిలోని ఓ వైద్యుడుపై డీసీహెచ్ఎస్ రంగారావు ఆగ్రహించారు. సదరు వైద్యుడు బయట ఓ ఆసుపత్రి, ల్యాబ్, మెడికల్ షాపు నిర్వహిస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మందుల కోసం స్లిప్పులు రాసి ఆ వైద్యుడి మెడికల్ షాపునకు పంపిస్తున్నారని విమర్శలు వవస్తున్నాయని ఆగ్రహించారు. దీనిని ఎందుకు పట్టించుకోవడం లేదని సూపరింటెండెంట్‌ను మందలించారు. ఇకనుంచి ఇలాంటివి జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఆ వైద్యుడు గురువారం సెలవులో ఉన్నట్లు సమాచారం.

ఓటు హక్కు పొందండి

పిడుగురాళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదుకోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మధుబాబు కోరారు. గురువారం స్థానిక స్కాలర్స్ డిగ్రీ కళాశాల, ఆక్స్‌ఫర్డ్, ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పీ.శ్రీధర్ మాట్లాడుతూ అర్హత కలిగిన యువత బీఎల్‌వో ద్వారా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్ధనరావు, బిఎల్‌ఓలు దీపిక, విటిలియ, రామకృష్ణ, శామ్యూల్‌బాబు, రంజిత్ కుమార్, ఇర్షాద్, సైదా రావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్
సాధారణ సమావేశం

● ఎజెండా అంశాలు ఏకగ్రీవ ఆమోదం

సత్తెనపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు ఎజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ షమ్మి, అధికారులు, కౌన్సిలర్లు, సమావేశానికి హాజరయ్యారు.

మహాత్ముడు జ్యోతిరావు పూలే

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● వర్ధంతి సందర్భంగా నివాళులు

సత్తెనపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో గురువారం మహాత్ముడు జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అటరానితనంపై పూలే అలుపెరుగని పోరాటం చేశారన్నారు. వెనుకబడిన బడుగుబలహీన వర్గాలకు హక్కులు, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని కీర్తించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వైవీ రామ స్వామి, తదితరులు పాల్గొన్నారు. తాలూకా సెంటరులోని పూలే విగ్రహానికి పట్టణ బీసీ, వడ్డెర సంఘాల నేతలు పలువురు నివాళులర్పించారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో గురువారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండాల సైదులు పట్టణంలోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రెంటచింతల (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ గురుకులంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


సత్తెనపల్లిలో పూలే చిత్రపటానికి నివాలర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

దాచేపల్లి,(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్ అధ్యక్షతన పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలనాడు బలహీనవర్గాల ఐక్యవేదిక నేతలు హాజరై పూలేచిత్రపటానికి నివాళులర్పించారు.

అచ్చంపేట(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట పంచాయతీ కార్యాలయం వద్ద టీడీపీ నేతలు మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతి నిర్వహించారు. టీడీపి బీసీనేత తిరువాయిపాటి ఆంజనేయులు పూలే చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు.

త్వరలోనే పోస్టుల భర్తీ..

● ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్
● 'నర్సింగ్ నై' ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

సత్తెనపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'నర్సింగ్ నై' అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తపై స్థానిక ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు స్పందించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నవజాత శిశువుల స్థిరీకరణ విభాగంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక వైద్యాధికారి పోస్టు ఆరు నెలలుగా ఖాళీగావున్న విషయం వాస్తవమేనని, త్వరలోనే ఆయా పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఐసీయూ విభాగం నిర్మాణంలో ఉన్నందున వెంటిలేటర్లను స్టాక్ రూమ్‌లో భద్రపరిచామన్నారు. త్వరలోనే వాటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. అలాగే ఆక్సిజన్ ప్లాంట్ సాంకేతికలోపం కారణంగా పనిచేయటం లేదన్నారు. ఈవిషయాన్ని కాంట్రాక్టరుకు, పై అధికారులకు తెలియజేశామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 4 గంటల వరకు కూడా వైద్యులందరూ ఓపీలో ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్న ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.


అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు

రాజుపాలెం, నవంరు 28(ఆంధ్రజ్యోతి): 'యువతరం ఓట్లు.. ప్రగతికి మెట్లు' అనే నినాదంతో కొండమోడు గ్రామంలో గురువారం విద్యార్థి కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్పెషల్ సమ్మరి రివిజన్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన తహసీల్దారు దుర్గేశ్వరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈవో చంద్రకళ

పాఠశాలలో డీఈవో తనిఖీ

అమరావతి, నవంబరు 28: మండల పరిధిలోని లింగాపురం జడ్పీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.చంద్రకళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గది వాతావరణాన్ని, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థి క్లాస్ వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్‌లను తనిఖీ చేసి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం బోధనా సిబ్బందితో సమావేశమై ఉపాధ్యాయుల, విద్యార్థుల గైర్హాజరుకాలాన్ని తగ్గించాలని సూచించారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. స్కూలు ఆవరణం, మరుగుదొడ్ల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ శివబాబు, హెచ్‌ఎం నరసింహస్వామి పాల్గొన్నారు. అనంతరం డీఈవో చంద్రకళ అమరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

కమ్యుటేషన్ కాలం తగ్గింపుపై హర్షం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు కమ్యుటేషన్‌ను 180 నుంచి 135 నెలలకు తగ్గించడంపై అమరావతి, పెదకూరపాడు పెన్షనర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు వై సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 135 నెలల కమ్యుటేషన్ దాటిన వారికి రికవరీ నిలిపివేయడం జరిగిందన్నారు. ఐఆర్ ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. సమావేశంలో సంఘ కార్యదర్శి సీహెచ్ తిమ్మయ్య హను మంతరావు, నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి లీలావతి

సబ్ జైలులో న్యాయాధికారి తనిఖీ

గురజాల లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును గురువారం న్యాయాధికారి టీ.లీలావతి తనిఖీ చేశారు. అక్కడున్న ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు న్యాయసహాయం కావాలని కోరిన వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. సబ్‌జైలులో భోజనం, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. న్యాయాధికారి వెంట స్థానిక సబ్‌కోర్టు న్యాయాధికారి వై శ్రీనివాసరావు, న్యాయ సహాయ న్యాయవాది కే.ప్రభుదాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

సత్తెనపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులతో ఆయన ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా నిర్వహించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై శ్రద్ధ చూపాలన్నారు. ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.6 కోట్ల 65 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వచ్చే సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం అభివృద్ధికి రూ. 1కోటి 42 లక్షలు, ముప్పాళ్ళ ప్రాథమిక కేంద్రం అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే కన్నా తెలిపారు.

దాడి ఘటనలో వైసీపీ నేతపై కేసు

సత్తెనపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలు చెల్లించమని అడిగినందుకు విద్యుత్ లైన్‌మెన్ సుంకర శేషకుమార్‌పై దాడిచేసిన 13వ వార్డు వైసీపీ నేత ఎల్.మాదవ్, అతని సోదరుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాదవ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. 2002 నుంచి మాదవ్ తన షాపుకు సంబంధించిన విద్యుత్ బకాయిలు చెల్లించక పోవడంతో లైన్‌మెన్ శేష కుమార్, శిబ్బంది బకాయిలు చెల్లించమని మాదవ్‌ను ప్రశ్నించారు. అనంతరం షాపులో విద్యుత్ ఫీజును తీశారు. దీంతో మాదవ్, అతని సోదరుడు దాడి చేశారని లైన్‌మెన్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


సీజీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డికి దేవుని ప్రతిమను అందజేస్తున్న ఆర్ఎం

చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

● సీజీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

దాచేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కే. ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలో బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయం, గృహం, విద్య వంటి రుణాలను చైతన్య గ్రామీణ బ్యాంకు అతి తక్కువ వడ్డీ రేటుకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అత్యాధునిక టెక్నాలజీతో గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ బ్రాంచ్‌ను కేశానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, అలుగుమల్లపాడు, కాచవరం గ్రామాల ప్రజలు వినియోగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట రీజనల్ మేనేజర్ శ్రీనివాసు పర్ల, కేశానుపల్లి బ్రాంచ్ మేనేజర్ బెక్కం నిఖిల పాల్గొన్నారు.

కృష్ణానదిలో మహిళ మృతదేహం లభ్యం

అమరావతి, నవంబరు 28:(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన అమరావతిలో పెద్దింటమ్మ ఆలయ సమీపంలోని కృష్ణానదిలో గుర్తుతెలియన మహిళ మృతదేహాన్ని గురువారం మధ్యాహ్నం స్థానికులు కనుగొన్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతురాలికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఒంటిపై ఎరుపు రంగు జాకెట్, బిస్కెట్ రంగు లంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు ఎవరైనా అమరావతి పోలీసు స్టేషనులో సంప్రదించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు పల్నాడు విద్యార్థులు

వెల్దుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాది జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన తాండ్రకొండ రాజశేఖర్ జాతీయస్థాయి అండర్ - 14 విభాగంలో బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగకుమారి తెలిపారు. ఒరిస్సాలోని పూరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రాజశేఖర్‌ను హైస్కూల్ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వేణుగోపాలరావు, గ్రామస్థులు అభినందించారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థి వీరదాసు మనోహర్ జాతీయస్థాయి అండర్14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయలలిత తెలిపారు. ఇటీవల కారంపూడిలోని బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచూపిన మనోహర్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్‌ను గురువారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చినరత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో బలరాం, సీతా మహాలక్ష్మి, సంధ్య, విద్యా కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు, సర్పంచ్ పుష్పలత శివరాం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్
ప్రధాన కార్యదర్శిగా చంద్రయ్య

మాచర్లటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్ అసోసియేషన్ మాచర్లశాఖ ప్రధాన కార్యదర్శిగా విశ్రాంత హెచ్‌ఎం అందుగుల చంద్రయ్య, సహాయ కార్యదర్శిగా పఠాన్ గౌస్‌మోహిద్దీన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో గురువారం వీరి ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో అధ్యక్షుడు నందా నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు, గౌరవాధ్యక్షుడు మర్రెడ్డి, ట్రెజరర్ గాలీబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) టీడీపీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాష్టి వీరాంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో 250 మంది సభ్యత్వం తీసుకున్నట్లు వీరాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పీ.శ్రీనివాస్, మదన్‌మోహన్, సాంబశివరావు, అనిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఖిద్మత్ వారియర్స్

వారంతా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అందరిలా మనకెందుకు అని వెళ్లిపోలేదు.. కష్టాల్లో.. ఆపదల్లో.. ఉన్న వారికి అండగా ఉండేందుకు ముందుకు వస్తున్నారు. మానవత్వాన్ని మించిన మతం లేదని నిరూపిస్తున్నారు. సీలింగ్ వర్క్స్, ఏసీ మెకానిక్‌లు, వెల్డింగ్ పని, పెయింటర్లు, ఇతర చేతి వృత్తులు, కూలీ పనులు చేసుకునే కొందరు యువకులు ఖిద్మత్ టీంగా ఏర్పడి విపత్కర పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ముందడుగేస్తూ... ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో కోవిడ్ వారియర్స్‌గా ముందుకొచ్చి వెలకట్టలేని సేవలందించారు. పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, పూట గడవని నిరుపేదలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు నిత్యావసరాలు, ఆర్థిక చేయూత అందిస్తున్నారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా తమ వంతు సేవలందిస్తూ మానవత్వాన్ని తట్టిలేపుతున్నారు.

- విపత్తుల్లో సహాయక చర్యలు
- కరోనా కాలంలో వెలకట్టలేని సేవలు
- పేద, అనాథ శవాలకు అంత్యక్రియలు
- మానవత్వంతో సేవలందిస్తున్న సభ్యులు
- అధికార యంత్రాంగానికి తోడుగా సేవలు



అగ్నిప్రమాదం సంభవించిన చోట ఫైర్ సిబ్బందికి తోడుగా ఖిద్మత్ టీం సభ్యులు



ఇటీవల మయన్మార్‌కు చెందిన పీజీ విద్యార్థి కొండప్ప అంత్యక్రియల్లో..

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ లాక్‌డౌన్‌కు పది రోజుల ముందు అంటే 2020, 14న సేవా దృక్పథం కలిగిన మంగళగిరికి చెందిన యాభై మంది యువకులు సమావేశమై ఆపన్నులకు సాయం చేయాలన్న లక్ష్యంతో ఓ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి 'ఖిద్మత్ టీం'గా నామకరణం చేశారు. సేవా కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందిస్తున్న తరుణంలో కరోనా మహమ్మారి ముంచుకొచ్చింది. కరోనా లాక్‌డౌన్ రెండో రోజు మసీదు వద్ద ఖిద్మత్ టీం సభ్యులకు ఓ యాచకుడు తాగునీరు అందక రోడ్డుపై ప్రాణాపాయ స్థితిలో కనిపించాడు. కొద్ది రోజులకు కోవిడ్‌తో ఓ మహిళ మృతి చెందింది. ఆస్తి తన పేరిట రాయలేదన్న కారణంతో అంత్యక్రియలకు కొడుకు నిరాకరించాడు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ టీం సభ్యులు అతడ్ని మందలించి, ఆ మహిళకు అంత్యక్రియలు జరిపించారు. లాక్‌డౌన్ తొలినాళ్లలో జరిగిన ఈ రెండు సంఘటనలూ ఖిద్మత్ టీంపై తీవ్ర ప్రభావం చూపించాయి. అధికారుల అనుమతితో కోవిడ్ వారియర్స్‌గా రంగంలోకి దిగారు. టీం కన్వీనర్ ఆదాం షఫీ టీం సభ్యులకు కోవిడ్ క్లిష్ట పరిస్థితులపై దిశానిర్దేశం చేస్తూ చైతన్యవంతం చేశారు. కోవిడ్‌తో మరణించిన వారిని కనీసం ఆఖరి చూపు చూసేందుకు కుటుంబ సభ్యులు ముఖం చాటేసిన సమయంలో ఖిద్మత్ బృందం అంత్యక్రియలు నిర్వహించింది. లాక్‌డౌన్ సమయంలో పేదలకు, యాచకులకు 40 రోజులపాటు ప్రతిరోజు 300 నుంచి 400 మందికి భోజనం అందించారు. హోం క్వారంటైన్‌లోని బాధితులకు భోజనం సరఫరా చేశారు. కోవిడ్ సమయంలో వచ్చిన రంజాన్ పండుగకు 400 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. లాక్‌డౌన్ తర్వాత కూడా ఖిద్మత్ టీం సేవా కార్యక్రమాలను విస్తృతం చేసింది. తమకి సమస్య ఉందని ఫోన్ వస్తే వెంటనే స్పందించి సాయం చేస్తున్నారు. వృద్ధులకు నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. వితంతు, ఒంటరి మహిళలు, అనారోగ్య బాధితులు, క్షతగాత్రులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చేయూత అందిస్తున్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు, క్రీడాకారులకు ఆర్థికసాయం అందించారు. ఇంటింటికీ పింఛన్ పంపిణీ లేనప్పుడు వృద్ధులు, దివ్యాంగులను పింఛన్ పంపిణీ కేంద్రాలకు తరలించేవారు. అగ్ని ప్రమాదాల సమయంలో నష్ట నివారణను తగ్గించేందుకు ఫైర్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారు. తుపాన్లు, వరదల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోను, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులకు తోడుగా నిలుస్తున్నారు.



కోవిడ్‌తో మృతిచెందిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఖిద్మత్ టీం సభ్యులు

మయన్మార్ విద్యార్థికి అంత్యక్రియలు

మయన్మార్‌కు చెందిన కొండప్ప అనే విద్యార్థి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ చదువుతూ పాముకాటుకు గురై మృతిచెందాడు. అంత్యక్రియలకు ఎవ్వరూ ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న ఖిద్మత్ బృందం కొండప్ప మృతదేహానికి మంగళగిరి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించింది. బౌద్ధ బిక్షువులు సైతం ఖిద్మత్ టీం సేవలను అభినందించారు. ఎర్రబాలెం గ్రామంలో పాముకాటుతో చనిపోయిన గోమాతను హిందూ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

ఖర్చంతా ఖిద్మత్ టీం సభ్యులదే...

50 మందితో ప్రారంభమైన ఖిద్మత్ టీం ఇప్పుడు 500లకు చేరింది. అనేక మంది ఖిద్మత్ టీం ద్వారా సేవలందించేందుకు ముందుకు వచ్చారు. సేవా కార్యక్రమాలకు అవసరమైన ఖర్చును సభ్యులే పూర్తిగా భరిస్తున్నారు. రోజువారీ వేతనాలతో తాము సంపాదించిన దాంట్లో నెలకు రూ.200 చొప్పున సేకరిస్తారు. వాటి ద్వారా ప్రతినెలా ఓ పది కుటుంబాలకు వివిధ రూపాల్లో సాయం అందిస్తున్నారు.

మానవత్వ ధీర అవార్డు


కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విశేష సేవలందించిన ఖిద్మత్ టీంను అధికార యంత్రాంగం గుర్తించింది. అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ ఏపీ పోలీసు శాఖ తరఫున ఇచ్చిన అవార్డుల్లో ఖిద్మత్ టీంకు మానవత్వ ధీర పురస్కారాన్ని ప్రకటించగా అప్పటి ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఖిద్మత్ ప్రదానం చేశారు. ఖిద్మత్ సేవలకు మెచ్చిన అనేక స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు పలు విధాలుగా అవార్డులను ప్రదానం చేశాయి.

కులమతాలకు అతీతంగా సేవ



కరోనా సమయంలో జరిగిన అనేక సంఘటనలు మా టీం సభ్యులను ఎంతగానో కలచివేశాయి. ఆపదలో ఉన్న వారికి తమకు చేతనైనంత సాయం చేయాలని నిర్ణయించాం. మా మత పెద్దలు, కుటుంబ సభ్యుల నుంచి మంచి ప్రోత్సాహం, సహకారం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం, సమాజంలో అన్ని వర్గాల నుంచి అందిన ప్రశంసలు మాలో మరింత స్థైరాన్ని నింపాయి. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం. ఏ ఆపద వచ్చినా తమను సంప్రదిస్తే సహకారం అందిస్తాం. సమాజంపై బాధ్యత కలిగిన యువత తోటి వారికి సాయం చేసేందుకు ముందుకు రావాలి.

-షేక్ ఆదాం షఫీ, టీం కన్వీనర్




ఖిద్మత్ టీం సభ్యులు

ఉత్తరాఖండ్‌పై మ్యాచ్‌లో ఆంధ్రా పట్టు



లోహిత్ (7 వికెట్లు)



రితిక్ (7 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు పట్టు బిగించింది. నాలుగు రోజుల మ్యాచ్‌లో భాగంగా తొలిరోజు ఆంధ్రా జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 48.4 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా బ్యాటర్లు ఈశ్వర్ రిత్విక్ 47, వరుణ్ సాత్విక్ 43 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ రితిక్ డూహరాన్ 16.4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో కేవలం 85 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. ఆంధ్రా బౌలర్ ఏఎన్‌వీ లోహిత్ 7.4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 19 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 76 పరుగులు చేసింది. లోహిత్ లక్ష్మీనారాయణ 39 పరుగులు చేశాడు. దీంతో ఆంధ్రా జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 130 పరుగుల ఆధిక్యంలో వుంది.

వెయిట్ లిఫ్టింగ్ విజేత శివాజీ యూనివర్సిటీ

పెదకాకాని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ కైవసం చేసుకుంది. అలాగే రన్నర్స్‌గా



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని వీసీ ఆచార్య కే గంగాధరరావు చేతుల మీదగా అందుకుంటున్న శివాజీ యూనివర్సిటీ విద్యార్థులు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిలిచింది. కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇందులో బెస్ట్ లిఫ్టర్‌గా యూనివర్సిటీ ఆఫ్ ముంబాయికి చెందిన క్రీడాకారిణి సౌమ్య దాల్వి కైవసం చేసుకున్నారు. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి టి.రేణుక స్ట్రాంగ్ ఉమెన్ కేటగిరీ అవార్డును సొంతం చేసుకున్నారు. విజేతలకు ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి గంగాధరరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ పోటీల నిర్వహణకు మహిళలతోపాటు ఆయా యూనివర్సిటీల టీం మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్ సహకరించినందుకు అభినందించారు. 365 మంది మహిళా క్రీడాకారులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారన్నారు. టెక్నికల్ కమిటీ చీఫ్‌గా వ్యవహరించిన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకటరామయ్య, ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ దిల్షా బాబు, డాక్టర్ డి. సూర్యనారాయణ, డాక్టర్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి హాజరు

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లపై విద్యాశాఖకమిషనర్ సమీక్ష

బాపట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతిపై నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారవడంతో విద్యాశాఖ కమిషనర్ గురువారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. కలెక్టర్ జె.వెంకటమురళితో కలిసి పరిసరాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు డిసెంబరు 7న జరిగే సీఎం కార్యక్రమానికి హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ఉన్నతస్థాయికి ఎదిగిన పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో వసతి పొందుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్గాఫ్ వార్ పోటీలను నిర్వహించాలన్నారు. పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో సిద్ధం చేసిన హెలిప్యాడ్, పాఠశాలకు చేరుకునే మార్గంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్షఅభియాన్ ఎస్పీడీ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్లు శ్రీనివాస రెడ్డి, మధుసూధనరావు, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి విలియమ్స్, సోషల్ వెల్ఫేర్ డీడీ జె.రాజాదెబోరా, మహిళా శిశు సంరక్షణశాఖ పీడీ కె.ఉమా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ వెంకటమురళి



అధికారులకు సూచనలు చేస్తున్న రాష్ట్ర విద్యాశాఖకమిషనర్ విజయరామరాజు

నూతన భవన సముదాయానికి రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను తెనాలిలోని ఐతానగర్‌కు చెందిన గడ్డిపాటి నాగయ్య చౌదరి, ఉషాబాల విరాళంగా ప్రకటించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో కే జే ఎస్ ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు గురువారం చెక్కును అందజేశారు. సామినేని కోటేశ్వర రావు మాట్లాడుతూ దాతలు అంద జేస్తున్న విరాళాలను సద్వినియోగం చేస్తామని అన్నారు. నూతన భవన నిర్మాణంను త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేజేఎస్ ఎస్ ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, పాలకవర్గ సభ్యులు రాయపాటి గోపాలకృష్ణ, మైనేని సీతారామయ్య, ఆర్‌వీఆర్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ, గడ్డిపాటి మనోజ్ కుమార్, మారుతి వరప్రసాదు పాల్గొన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న దాతలు

కోడిగుడ్డు ధర.. పైపైకి

- హోల్‌సేల్‌లో గుడ్డు రూ.6
- చిల్లర దుకాణాల్లో రూ.7కు విక్రయం
- మరింత పెరగ వచ్చంటోన్న వ్యాపారులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర రోజురోజుకు పైపైకి చేరుతోంది. గుడ్డు ధర హోల్‌సేల్‌లోనే రూ.6కు చేరింది. వంద గుడ్ల ధర రూ.600లుగా పేర్కొంటూ విజయవాడ జోన్ నెక్ వ్యాపారులు ప్రకటించారు. దాంతో సాధారణ చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. అయితే గుడ్డు ధర మరింతగా పెరిగే ఛాన్స్ లేకపోలేదని పౌల్ట్రీ వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు కార్తీకమాసం కావడంతో సాధారణంగా మాంసాహారం, గుడ్ల విక్రయాలు పడిపోతుంటాయి. అయినా కోడిగుడ్డు ధరలు మాత్రం రోజురోజుకు పెరగడం సామాన్య ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది.



చిన్నారుల నుంచి పెద్దల వరకు కోడిగుడ్డు అంటే ఇష్టపడని వారుండరు. విభిన్న రకాలుగా ఆహారంలో కోడిగుడ్డును ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కోడిగుడ్ల డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంతేగాక గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచే కాక తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కోడిగుడ్లు పశ్చిమ బెంగాల్‌కు పెద్దఎత్తున ఎగుమతులు ఉన్నాయని ఫలితంగానే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఈ నెల మొదటి వారంలో 100 గుడ్లు రూ.565 నుంచి రూ.535 వరకు తగ్గి మరలా పెరుగుతూ వచ్చింది. గత వారంలో 100 గుడ్లు రూ.580, రూ.590కు కొనసాగింది. తాజాగా 100 గుడ్లు రూ.600లకు చేరింది. నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల్లో కేక్‌లకు పెద్దఎత్తున కోడిగుడ్లను వినియోగించే అవకాశం ఉందని తద్వారా డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని చెబుతున్నారు. ఫలితంగానే కోడిగుడ్డు ధర ఎన్నడూ లేని విధంగా గణనీయంగా పెరిగింది. దీంతో ఇదే అదునుగా చిల్లర దుకాణాల్లో గుడ్డు ధర రూ.7లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుత ధర కొంతకాలం కొనసాగే అవకాశం ఉంది.

రైల్వేయార్డు... రీమోడలింగ్

- మూడు వంతెనల వైపు ట్రాక్ విస్తరణ
- గుంటూరు స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలలో 24 భోగీల రైళ్ల నిలుపుదల
- కోచింగ్ డిపోకు సులభతరం కానున్న రైళ్ల రాకపోకలు
- నూతనంగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నిర్మాణం



డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద ప్రారంభమైన గుంటూరు రైల్వే యార్డు రీమోడలింగ్ పనులు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేజంక్షన్‌లో అన్నీ ప్లాట్‌ఫాంలలోకి 24 భోగీలు (గరిష్ట సంఖ్య) ఉండే రైళ్లను నిలుపుదల చేసేందుకు అవసరమైన యార్డు రీమోడలింగ్ పనులను రైల్వే శాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగానే మూడు వంతెనల వైపున రోడ్డు ట్రాఫిక్ బ్లాక్‌ని తీసుకొన్నది. 60 రోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేసి ఆ తర్వాత పెండింగ్ యార్డు రీమోడలింగ్ పనులు చేపట్టాలని భావిస్తున్నది. అంతేకాకుండా మూడు వంతెనల వైపు రోడ్డు మార్గంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేయడం ద్వారా 2025వ సంవత్సరం నుంచి శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభమైనా ట్రాఫిక్‌ని ఈ మార్గం నుంచి మళ్లించేందుకు మార్గం సుగమమౌతుంది.

- రైల్వేబోర్డు ఇటీవలే గుంటూరు రైల్వేస్టేషన్‌కు ఎన్ఎస్‌జీ-3 నుంచి ఎన్ఎస్‌జీ-2 కేటిగిరీగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే అందుకు తగినట్లుగా సదుపాయాలు ఇక్కడ అందుబాటులో లేవు. ముఖ్యంగా పేరుకు ఏడు ప్లాట్‌ఫాంలు ఉన్నా అందులో 24 భోగీల ఫుల్ లెంగ్త్ రైళ్లను కేవలం 1, 4 ప్లాట్‌ఫాంల మీదనే నిలుపుదల చేయగలరు. మిగతా ప్లాట్‌ఫాంలలో 15 నుంచి 18 భోగీల రైళ్లను మాత్రమే తీసుకోగలరు. ప్రస్తుతం కొన్ని రైళ్లను ఆరో నంబరు ప్లాట్‌ఫాంలోకి తీసుకోవడం వలన ప్రయాణీకులు ఎక్కాల్సిన భోగీలు ప్లాట్‌ఫాం దాటిపోయి ఉంటున్నాయి. దాంతో వాటిల్లోకి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలానే రైలు దిగే సమయంలోనూ ఇక్కట్లు ఎదురౌతున్నాయి. దీని దృష్ట్యా యార్డు రీమోడలింగ్ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకోసం రూ. 125.16 కోట్లకు పైగా నిధులు కూడా విడుదలయ్యాయి.
- యార్డు రీమోడలింగ్‌లో భాగంగా కొత్తగా ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాంని కూడా నిర్మించబోతున్నారు. అలానే మిగతా ఏడు ప్లాట్‌ఫాంలలో కూడా 24 భోగీల రైళ్లని నిలిపేలా విస్తరిస్తారు. ప్రస్తుతం గుంటూరు కోచింగ్ డిపో మూడు వంతెనల వైపు ఉన్నది. కోచింగ్ డిపోలోకి రైళ్లు వెళ్లాలంటే ఆ సమయంలో గుంటూరు - విజయవాడ రైళ్లను నిలిపేయాలి. అలానే కోచింగ్ డిపోలో భోగీల అమరిక (షంటింగ్) చేసేటప్పుడు కూడా గుంటూరు నుంచి విజయవాడ వైపునకు రైళ్లను పంపే పరిస్థితి లేదు. దీంతో సమయపాలన దెబ్బ తింటున్నది. ఈ నేపథ్యంలో కొత్తగా నిర్మించబోతున్న ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫాం నుంచి నేరుగా కోచింగ్ డిపోకి రైళ్లు వెళ్లేందుకు మూడు వంతెనల మీదగా రైలుమార్గాన్ని నిర్మిస్తున్నారు. ఇందు కోసమే ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేశారు.



నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

వినుకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ గురువారం తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

పరిమళించిన రాజకీయ సామరస్యం

నరసరావుపేట లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పరిణత రాజకీయాలకు తార్కాణంగా గురువారం ఓ సంఘటన చోటుచేసుకుంది. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పాత పల్నాడు బస్టాండ్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఒకే సమయంలో వచ్చారు. ఇద్దరూ కూడా తమ తమ అనుచరులతో పక్కపక్కనే మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఆవేశాలకు, వ్యక్తిగత విమర్శలకు తావు లేకుండా అత్యంత సామరస్య వాతావరణంలో ఇద్దరూ తమ అనుచరులతో వెనుదిరిగారు.

నేడు గణపవరంలో జాబ్ మేళా

నాదెండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గణపవరంలోని చుండి రంగనాయకులు కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పదో తరగతి నుంచి పీజీ, డిప్లొమో చేసిన వారు కూడా హాజరు కావచ్చు అన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్‌లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

నేడు కార్తీక వన సమారాధన

రొంపిచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత శంకర స్వామి ఆలయంలో శుక్రవారం భారీ కార్తీక వన సమారాధన కార్యక్రమం జరుగుతుందని వన సమారాధన కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాలలు ధరించిన అయ్యప్ప, కనకదుర్గ, ఇతర స్వాములకు చద్ది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రొంపిచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులపాడు గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం, త్రయోదశి సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అర్చకులు నారాయణ హనుమంతచార్యులు, నారాయణ వెంకట రుక్మిణి కృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఓటరుగా నమోదుపై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఓటరుగా నమోదుపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మున్సిపల్ సూపర్‌వైజర్ డానియేల్, టీపీవో సాంబయ్య ఫారం-6 ఉపయోగించి ఓటును ఎలా నమోదు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

వినుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకుపాలెం గ్రామంలో మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకోవాలని, బహిరంగ మలవిసర్జన చేపట్టరాదని సూచించారు. పంచాయతీ కార్యదర్శి అనుదీప్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నివారణపై అవగాహన

నరసరావుపేట లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాల నివారణపై పట్టణంలోని 12వ వార్డులో మొదటి పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు ఆడపిల్లలతో మగ పిల్లలు ఏ విధంగా మసలుకోవాలో వివరించారు. తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాలన్న విషయంపై అవగాహన కలిగించారు. పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే ఏవిధమైన ప్రమాదాలు సంభవిస్తాయో తెలియజేశారు. తెలిసి, తెలియని సమయంలో కేసులో ఇరుక్కున్న వారికి రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు తీసివేసే విధానాన్ని వివరించారు.

రేపు రుణాల మంజూరుపై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్‌లో 30న ఉదయం 10 గంటలకు ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, పీఎం విశ్వకర్మ తదితర పథకాల ద్వారా రుణాల మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నరసరావుపేట ఎంపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటనను గురువారం విడుదల చేశారు. కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా అధికారులు హాజరు అవుతారని అన్నారు.

భూమిని కబ్జా చేసేందుకు వైసీపీ నేతల కుట్ర

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు,



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) : వివిధ సమస్యలపై బాధితులు టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలి వచ్చారు. వారి నుంచి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిల్డింగ్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ సలహా కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు గురువారం అర్జీల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి నేతలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ప్రధానంగా కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదు చేసిన వారిలో కడప జిల్లా కాశీనాయన మండలం కె.ఎస్.కోటాల గ్రామానికి చెందిన ఒర్సు కిరణ్ కుమార్, ఒర్సు బాలయ్య ఫిర్యాదు చేశారు. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని కబ్జా చేసి వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని, ఆన్‌లైన్ రికార్డులు మార్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇదిలా ఉండగా గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం మందడం గ్రామానికి చెందిన వాకచర్ల వీరయ్య ఫిర్యాదు చేస్తూ వైకుంఠపురంలో 22ఏ జాబితాలో ఉన్న తమ పొలానికి ఎన్‌వోసి ఇప్పిస్తానని చెప్పి తమ వద్ద వడ్లమూడి గ్రామానికి చెందిన చుంచు సుధీర్ రూ.50 లక్షలు తీసుకొని మోసం చేశారని, తమ డబ్బు ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలానికి చెందిన ఏపీ రామారావు 2018-19లో మండలంలోని పలు చెంచుగూడాల్లోని అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేశామని, అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవ్వులూరు గ్రామానికి చెందిన జయలక్ష్మి తన తండ్రి ఆస్తిపై కన్నేసిన కొందరు తన తల్లి బతికి ఉండగానే మరో మహిళను తన తండ్రికి భార్యగా దొంగ పత్రాలు సృష్టించుకొని తమ ఆస్తిని వేరొకరికి అమ్మారని, ఆస్తి కొనుగోలు చేసిన అక్రమార్కులు ఆ ఆస్తిని బ్యాంకులో తనకా పెట్టి డబ్బులు తెచ్చుకున్నారని, అక్రమానికి సహకరించిన అధికారులు తమ తండ్రి ఆస్తి కొట్టేయాలని చూసిన కుట్రదారులపై ఫిర్యాదు చేశారు. అన్నమయ్య జిల్లా సీతానగరం మండలం మరిపివలస గ్రామానికి చెందిన దివ్యప్రసాద్ రాగికొనవలస కమ్మల గూడంలో నివసించే ఆదివాసీల జీవనోపాధికి ప్రభుత్వ భూమిని కేటాయించి ఆదుకోవాలన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం పెద్ద ఉయ్యాలవాడ గ్రామంలో పంట పొలానికి నీరు రాకుండ పంట కాల్వను పూడ్చివేసి తమను ఇబ్బందులు పెడుతున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని పంట కాల్వకు నీరు వచ్చే విధంగా సహాయం చేయాలని గ్రామానికి చెందిన రావి వెంకటాద్రి ప్రజాప్రతినిధులను మొర్రపెట్టుకున్నారు. కృష్ణ జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన షేక్ బాజి షరీఫ్ రోడ్డు మీదకి తడికకట్టి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు షేక్ పెద్ద నాగూర్ అనే వ్యక్తి ప్రయత్నించగా దానిని ప్రశ్నిస్తే తన పై హత్యయత్నానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయించిన వారి పై చర్యలు తీసుకోవాలని నేతలను కోరారు.

వంద శాతం ఆక్యుపెన్సీ పెంచండి : ప్రత్తిపాటి



ఏరియా ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేటలో వంద పడకల ఏరియా ఆసుపత్రి సాధించి తీసుకురాగా, వైసీపీ హయాంలో ఆసుపత్రి అభివృద్ధిలో పురోగతి లేకుండా పోయిందని ఎమ్మెల్యే, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి సంఘం చైర్మన్ ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. పట్టణంలోని మద్దినగర్‌లో ఉన్న 100 పడకల ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పేషంట్లతో ముఖాముఖి మాట్లాడారు. ఆసుపత్రి పనితీరుపై ఆరా తీశారు. ఆసుపత్రి మౌలిక సదుపాయాల, సిబ్బంది కొరత తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ కుమారిని అడిగి తెలుసుకున్నారు. సుమారు వివిధ విభాగాలలో సిబ్బంది కొరత ఉందని, రూ. 9.30 కోట్ల నిధులు మంజూరైనా ప్రహరీ నిర్మాణం ప్రారంభం కాలేదని చెప్పారు. తక్షణమే ఆ పనులను ప్రారంభించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆయన ఆదేశించారు. లేదంటే కాంట్రాక్టర్‌ను మార్చి మరెవరికైనా పనులు అప్పగించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు.. ఆసుపత్రికి కావాల్సిన పరికరాల వివరాలను లిఖిత పూర్వకంగా అందిస్తే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో చర్చించి మంజూరు చేయిస్తానని చెప్పారు. సిబ్బంది పనితీరును మరింత మెరుగుపర్చుకుని సేవలు అందిస్తే వంద పడకలు అక్యుపెన్సీ సాధించవచ్చునని, ఆ దిశగా ఆసుపత్రి సిబ్బంది పని చేయాలని వైద్యులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్, అభివృద్ధి సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు, షేక్ షాబీరా బేగం, వట్టిప్రోలు శ్రావణి పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఆగ్రహం

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందనీ, ఈ ప్రక్రియలో చిలకలూరిపేట పురపాలక సంఘం మెప్మా సిబ్బంది వెనుకబడి ఉండటం పట్ల శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు.

నరసరావుపేట పరిశుభ్రమే లక్ష్యం



మురుగు కాలువ శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం పారిశుద్ధ్యంపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా పట్టణంలోని ఒకవ వార్డులో పారిశుధ్య కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. సిబ్బందిని, కార్యకర్తలన్ని వెంటబెట్టుకొని తిరుగుతూ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఫాగింగ్ చేపట్టారు, చీపురుపట్టి రోడ్లు ఊడ్చారు. కాలువలు శుభ్రం చేశారు. కాలువ సమీపంలో పెరిగిన పిచ్చి మొక్కల్ని కట్టర్లతో తొలగించారు. దోమల కారణంగానే వ్యాధులు వ్యాప్తి తీవ్రం అవుతుందని, దోమలు పెరిగే ప్రాంతాలన్నింటినీ ఫాగింగ్, డీ వార్మింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు, ఎక్కడా చెత్తా, చెదారం రోడ్లపై వేయకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే ఆది కేవలం వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో మాత్రమే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగించాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆ మహనీయుని ఆశయాలు కొనసాగించటమే మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. టీడీపీ, జనసేన. బీజేపీ, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని విరమించాలి

వినుకొండటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించాలని, కరెంటు ట్రూ ఆఫ్ ఛార్జీలను పెంచాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతివరప్రసాద్ డిమాండ్ చేశారు. వినుకొండ శివయ్య భవన్‌లో గురువారం జరిగిన వామపక్ష ప్రజా సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచి స్మార్ట్ మీటర్లను బిగించాలని ప్రయత్నంచేసి వాటిని వ్యతిరేకించి ఆనాడు టీడీపీ వామపక్షాలతో కలిసి జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారని, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆనాడు ప్రజలకు వాగ్దానం ఇస్తూ అధికారంలోకి వస్తే స్మార్టు మీటర్లు ఎత్తివేస్తామని, కరెంటు ఛార్జీలు పెంచుబోమని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంటు ఛార్జీలు రూ.15 వేల కోట్లు పెంచాలనే ఆలోచన చేయడం రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపడమేనని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని విరమించాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలతో కలిపి ఉద్యమం చేపడాతమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, ఆర్‌కె నాయుడు , ముని వెంకటేశ్వర్లు, ఫిరోజ్, ఏఐటీయూసీ నాయకులు షేక్ కిషోర్, చిన్న, దూపాటి మార్కు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన 43వ అండర్ 17, అండర్ 19 బాల బాలికల రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కీలకంగా వ్యవహరించి అద్భుతమైన ప్రతిభ చూపారు. ఈ పోటీలలో మొత్తం 12 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు అనకాపల్లి జట్టుపై రెండు సున్నా తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థులు నాగ రామ్ చైతన్య , సాయిచరణ్, ఎం మారుతి పవన్ కుమార్, షేక్ గయాస్, సీహెచ్ కోటేశ్వరరావులను గురువారం స్కూలులో నిర్వహించిన సభలో చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శివానంద కుమార్, ప్రిన్సిపాల్ షేక్ గౌశల్ అజం అభినందించారు.

ప్రకృతి వ్యవసాయపై శిక్షణ

నరసరావుపేట రూరల్, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజిరెడ్డి మీటింగ్ హాల్లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన శిక్షకులతో జిల్లాలోని పిడుగురాళ్ళ డివిజన్ కు సంబంధించిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 28 నుంచి 2వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీడీ అమల కుమారి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటిరోజు ప్రకృతి వ్యవసాయంలో 9 సార్వత్రిక సూత్రాల్లో భాగంగా మొదటి రెండు సూత్రాలు వివరిస్తామన్నారు. భూమిని 365 రోజులు పంటలతో కప్పి ఉంచాలని ఈ విధానం ఆచరించడం ద్వారా భూమిలో నిరంతరం కర్బన పదార్థం చేకూరడం ద్వారా భూమి త్వరగా సారవంతం అవుతుందన్నారు. సూక్ష్మజీవుల వృద్ధి, భూమి వర్షానికి కోతకు గురి కాకుండా, రైతులకు కలుపు ఖర్చు తగ్గుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులలో కూడా పంటలు బెట్టను తట్టుకుంటాయన్నారు. పంటల వైవిధ్యం. ప్రతి రైతు కనీసం వారి క్షేత్రంలో 15 నుంచి 20 రకాల పంటలు ఉండాలని ఈ విధానం ఆచరించడం ద్వారా పంటలకు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని వివిధ రకాల వేరు వ్యవస్థలు ఉండడం ద్వారా వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది భూమి సారవంతం అవుతుందన్నారు. పంటలకు వర్షాబావ పరిస్థితులను తట్టుకునే శక్తి లభిస్తుందని పంటకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందన్నారు. అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజు పాల్గొన్నారు.

చెత్తసేకరణ కేంద్రాన్ని వాడుకలోకి తేవాలి

మతుకుమల్లి(శావల్యాపురం)నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మతుకుమల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్తసేకరణ కేంద్రాన్ని వాడుకలోకి తెచ్చి పారిశుద్యాని మెరుగు పరచాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు మతుకుమల్లి మాజీ సర్పంచి, టీడీపీ మాజీ రాష్ట్ర పరిశీలకులు ముండ్రు హనుమంతరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను సర్పంచిగా ఉన్నప్పుడు లక్షలకొద్దీ ప్రజాధనాన్ని ఖర్చు చేసి నిర్మించిన చెత్తసేకరణ కేంద్రం ఇప్పుడు పిచ్చిచెట్లు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని, చెత్తసేకరణ కేంద్రానికి ఎన్టీఆర్ చంద్రన్న సంపద సృష్టి కేంద్రం పేరును ఏర్పాటు చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేరును తొలగించారన్నారు. గత ఐదేళ్లగా చెత్తసేకరణ కేంద్రాన్ని నిలిపివేయడంతో గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందన్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు చెత్తసేకరణ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని, ఎన్టీఆర్, చంద్రన్న సంపద సృష్టి కేంద్రం పేరును మళ్లీ పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

రేపు చిలకలూరిపేట పోస్ట్ ఆఫీస్ భవనానికి శంకుస్థాపన

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబ్బయ్య తోట ప్రాంతంలో తహసీల్దార్ ఆఫీస్ వెనుక వైపున ఉన్న పోస్టల్ శాఖ సొంత స్థలంలో ఈ నెల 30న చిలకలూరిపేట పోస్ట్ ఆఫీస్ భవనానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి గురువారం తెలిపారు. ముఖ్య అతిథులుగా కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, అతిథులుగా శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్, పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, తపాలా శాఖ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె ప్రకాష్, పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీ ఆర్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ కె.సంతోష్ నేత పాల్గొంటారని పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు చిలకలూరిపేటలో పోస్ట్ ఆఫీస్‌కు సొంత భవనం లేదు. 12 సెంట్లు స్థలం ఉన్నప్పటికీ భవన నిర్మాణం జరుగలేదు. అద్దె భవనాలలోనే పోస్ట్ ఆఫీస్ కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం నూతన భవన నిర్మాణానికి రూ2.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతగా రూ.50 లక్షలు విడుదల చేశారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఉన్న వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మొబైల్స్ ఉపయోగించేవారు ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునే యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అక్కడ వచ్చేటటువంటి అప్షన్స్ క్లియర్‌గా చూసుకొని అలౌవ్ చేయాలన్నారు. లేకపోతే మొబైల్‌లో ఉండే డేటా మొత్తం హ్యాక్ అయ్యే అవకాశం ఉందన్నారు. మొబైల్ వినియోగ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పీవీ కిషోర్, ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ట రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంచార వాహనాల ద్వారా పశువులకు వైద్యం అందించాలి



పశువైద్యాధికారికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట చుట్టుపక్కల గ్రామాల్లో గతంలో సంచార వాహనాల ద్వారా గ్రామాలకు వారానికి ఒకటి, రెండు సార్లు వచ్చి వైద్యం అందించే వాళ్లు, ప్రస్తుతం సక్రమంగా గ్రామాలకి సంచార వాహనాలు రావట్లేదని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. పట్టణంలోని ప్రజా సంఘాల నాయకులు గురువారం నరసరావుపేట పట్టణం పెద్ద చెరువులో ఉన్న పశువుల ఆసుపత్రి వద్ద ఏడీఏ రామచంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుత విధానం ప్రకారం ఫోన్ చేయగానే మొబైల్ వాహనం, డాక్టరు, సహాయకులు వస్తారని తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వైద్యం, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పశుసంవర్థక శాఖ రాష్ట్రంలో ఉన్న పశువులపై దృష్టి పెట్టి మందులు, డాక్టర్లు, సహాయకులు, వాహనాలు సమకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్టు



పేకాట శిబిరంపై దాడి చేస్తున్న పోలీసులు

లింగంగుంట్ల(నరసరావుపేట రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. గురువారం మధ్యాహ్నం నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలోని శ్రీలక్ష్మి విజయ పార్కింగ్ రూంలో పేకాట ఆడుతున్న వారిపై తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.72,100 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

రొంపిచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ వెనుకబడిన కులాల అభ్యున్నతికి జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని అన్నారు. తన భార్య సావిత్రిబాయి పూలేకి విద్యనేర్పి ఆమెను ఉపాధ్యాయురాలిగా చేసి స్త్రీ విద్యా వ్యాప్తికి ఎంతో కృషి చేశారని అన్నారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రతి జిల్లాకు బీసీ భవన్ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు కోనేటి నరసింహారావు, ముక్కడాల వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ సుబ్బరాజు, చక్రవరం సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదుపై అవగాహన పెంపొందించుకొని ఓటరుగా నమోదు కావాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అర్హులేనని చెప్పారు. ఓటరుగా నమోదు కావాలంటే ఆధార్ కార్డు, పదో తరగతి ధ్రువ పత్రాలతో ఓటరు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, కళాశాల ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎన్ఎస్ఎస్ పీవో హెచ్.గంగాధరరావు, వీఆర్‌వో రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలన

వినుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కాపురం రోడ్డు వెంబడి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు నిర్మిస్తున్న 420 మీటర్ల డ్రెయినేజీ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు పలు సూచనలు అందజేశారు.

పశు పోషకులు బెంబేలు

వినుకొండటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో గత కొంత కాలంగా పశువుల అపహరణ తరచూ జరుగుతుండటంతో పశుపోషకులు బెంబేలెత్తితున్నారు. ఇటీవల ఆరుబయట కట్టివేసి ఉన్న అనముల మూరి శంకర్‌కు చెందిన సుమారు రూ.లక్ష విలుచేసే పాడిగేదెను అపహరించారు. అదేవిధంగా వీరగంధం సుబ్బారావు, వీరాంజనేయులుకు చెందిన 5 పొటేళ్ళతోపాటు చంద్రరావుకు చెందిన 10 గొర్రెలు, వీరగంధం శ్రీనివాసరావుకు చెందిన గేదెలను విడతలవారిగ అపహరించారు. దీంతో పశుపోషకులు రాత్రి వేళలో నిత్యం కాపల ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి గ్రామంలో నెలకొంది. వరుస అపహరణలపై విచారణ జరిపి పశుపోషకులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జియో ట్యాగింగ్ సర్వేని వేగవంతం చేయాలి



కారుమంచిలో సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేసేందుకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన జియో ట్యాగింగ్ సర్వేని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. మండలంలోని కారుమంచి గ్రామంలో జరుగుతున్న సర్వేని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 13103 ఇళ్లు ఉండగా, 10128 ఇళ్లను జియో ట్యాగింగ్ చేశామని, 77.29 శాతం సర్వే పూర్తయిందన్నారు. వలస కార్మికులు, ఉద్యోగ, వ్యాపార, జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నవారి ఇళ్లను ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ ద్వారా జియో ట్యాగింగ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందని, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శిక్షణలను రద్దు చేయాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లీడర్‌షిప్, ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ శిక్షణలను రద్దు చేయాలని ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు గురువారం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆరు రోజుల పాటు పాఠశాలలను వదిలివేసి సరైన సౌకర్యాలు లేకుండానే రెసిడెన్షియల్ పద్ధతిలో ఇచ్చే శిక్షణ వలన విద్యార్థులకు బోధన కుంటుపడుతుందన్నారు. అంతేకాక సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన ఇటీవల ఆగిరిపల్లి శిక్షణ కేంద్రంలో టి.రత్నకుమార్ అనే ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలని ఫ్యాప్టో అధికారులకు విన్నవించిందని, అధికారులు నిరంకుశ ధోరణితో పెడచెవిన పెట్టి తిరిగి రెసిడెన్షియల్ పద్ధతిలో జరిపిన శిక్షణలో విజయనగరం జిల్లా గజపతినగరం శిక్షణ కేంద్రంలో ఎస్.శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించాడని చెప్పారు. ఇప్పటికైనా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌ను రద్దుచేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో డివిజన్ మండల స్థాయిలో శిక్షణ తరగతులను జరపాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పద్ధతిని కొనసాగిస్తే బాయ్‌కాట్‌కు పిలుపుని ఇస్తామని సెక్రటరీ వి.అశోక్‌కుమార్ హెచ్చరించారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఉన్న ఓల్డ్ చెక్‌పోస్ట్ సమీపంలోని గుడ్‌హార్ట్ కార్యాలయంలో దివ్యాంగులు 20 మందికి నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు.